క్లుప్తంగా

జల్దిబిందె వేడుక



కోయిల్‌కొండ: మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో మంగళవారం అభయ ఆంజనేయ స్వామి జల్దిబిందే, పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సమీపంలోని ఎర్రజిన్నబావి నుంచి జల్దిబిందేను ఊరేంగిపుగా కోళాటాలు, భజనలతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

పద్మనాభస్వామి జాతర



నవాబుపేట: మండల పరిధిలోని తీగలపల్లిలో వెలసిన పద్మనాభస్వామి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వాహనాలతో దేవాలయం చుట్టూ శకటోత్సవం చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో పంచాంగం వినిపించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ జంగయ్య, నారాయణ, చెన్నయ్య, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

నవాబుపేట: మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో ఎట్టకేలకు ప్రజలకు తాగునీరు అందించారు. వారం రోజులుగా నీరు లేకపోవటంతో ప్రజలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు గ్రామానికి వచారు. పైప్‌లైన్ సమస్యను పరిష్కరించి నీరందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

కరపత్రం విడుదల

హన్వాడ: జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఈనెల 27న నిర్వహించబోయే పూలె, అంబేద్కర్ 4వ జాతరను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా దండోర అధ్యక్షుడు ఎస్ బాల్‌రాజు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని గొండ్యాల్ గ్రామంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. జాతరకు కళాకారులు, మేధావులు హాజరవుతున్నారన్నారు. దళిత, బహుజనులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. దండోర నాయకులు ర్యాకమయ్య, వెంకటేష్, నాగేష్, విష్ణు, అచ్చన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలి

మహమ్మదాబాద్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని సమాచార హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దిడ్డికాడిగోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో యువకులతో కలిసి వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఫీజుల నియంత్రణ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. గోపాల్, రవి, నరేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోడ గడియారాల పంపిణీ



దేవరకద్ర: బల్సుపల్లిలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో గోడ గడియారాలను పంపిణీ చేశారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశాలతో కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయులు, అక్షయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేపూర్‌లో ఇఫ్తార్

హన్వాడ: మండల పరిధిలోని వేపూర్‌లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు కోస్గి యాదయ్య సోదరులకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. స్థానిక మసీదులో ఏర్పాటు చేసిన ఇబ్రహీం, ఖాజాపాషా, లక్ష్మారెడ్డి, సుబ్బారెడ్డి, రాంచంద్రయ్య, అంజిలయ్య పాల్గొన్నారు.

భూత్పూర్: మండలంలోని కర్వెన గ్రామంలోని జామియా మసీద్‌లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మున్సిపల్ టౌన్ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ముత్యాల నర్సింహులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.ఫారూఖ్, కర్వెన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమానికి సహకరించాలి

చిన్నచింతకుంట: రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి సహకరించాలని.. ఉమ్మడి జిల్లా సమితి నాయకులు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డిని కోరారు. మంగళవారం చిన్నచింతకుంటలో ఆయనను కలిశారు. నాయకుడు యాదగిరి మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ప్రజలకు అన్యాయం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. నిరసనగా ఉమ్మడి జిల్లాలో ఉద్యమం చేపడుతామన్నారు.



హన్వాడలో పంచాంగ శ్రవణం



జడ్చర్లలో పచ్చడి పంపిణీ



గాధిర్యాల్‌లో వీరాంజనేయ స్వామి పల్లకీసేవ



కోయిల్‌కొండలో..

వైభవంగా ఉగాది సంబురం



గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండలకేంద్రాల్లో మంగళవారం ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు.

మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మాచన్‌పల్లి, కోడూర్, మనికొండ, గాజులపేట, ధర్మాపూర్, కోటకదిర, ఫతేపూర్, వెంకటాపూర్, దివిటిపల్లి, అప్పాయిపల్లి, అల్లీపూర్, అప్పాయిపల్లి, బొక్కలోనిపల్లి, కోటకదిర, ఇప్పలపల్లి తదితర గ్రామాలలో మంగళవారం ఉగాది వేడుకల సందర్భంగా ఆలయాల్లో భక్తులు సందడి చేశారు.

జడ్చర్లలో హిందూ వాహిణీ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ చౌరస్తాలో పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాంత సంపర్క్ ప్రముఖ్ రాజుగౌడ్, పట్టణ కన్వీనర్ మణిరత్నం, సంతోష్, నాగరత్నం, మహేశ్, భాస్కర్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు. జడ్చర్లలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం, గొల్లపల్లి లలితాంబికా ఆలయంనకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. గంగాపురం లక్ష్మీచెన్నకేశవుడి సన్నిధిలో ఉగాది పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం చేశారు.

గండేడ్ పరిధిలో పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం చేశారు. వెన్నాచేడ్‌లో వెన్నోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద శకటోత్సవం నిర్వహించారు. ఛత్రపతి శివాజీ, వివేకానంద యువజన సంఘాల ఆధ్వర్యంలో రచ్చకట్ట వద్ద పెద్ద పెద్ద కుండల్లో పచ్చడి తయారు చేసి గ్రామపెద్దలతో పంపిణీ కార్యక్రమం ప్రారంభింపజేశారు. అంతకుముందు గ్రామంలోని ఆరవ వార్డుకు మంజునాథ కాలనీగా నామకరణం చేస్తూ బోర్డుపెట్టి మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. సత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, కన్వీనర్ నారాయణరెడ్డి, ప్రధాన వక్త నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య, డైరెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ మండల వ్యాప్తంగా నంచర్ల, మొకర్లాబాద్, చౌదర్‌పల్లి, గాధిర్యాల్ గ్రామాల్లో ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. గాధిర్యాల్‌లో వీరాంజనేయస్వామి పల్లకీ సేవ, శకటోత్సవం నిర్వహించారు.

బాలానగర్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాజాపూర్ మండల కేంద్రంతో తిర్మలాపూర్, చొక్కంపేట్, మల్లేపల్లి, కల్లేపల్లి, ఈద్గానీపల్లి రంగారెడ్డిగూడ తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. వేద పండితులు నర్సింహ్మశర్మ పంచాంగం వినిపించారు.

హన్వాడపరిధిలోని ఆయా గ్రామాల్లో జల్దిబిందె వేడుకలు నిర్వహించారు. వేపూర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధ్వజారోహణ చేపట్టారు. టంకరలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

మిడ్జిల్ పరిధిలోని గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

క్రోధినామ సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని పంచాంగ కర్తలు వై.రఘురామాచారి ఆకాంక్షించారు. మంగళవారం కోయిల్‌కొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. పంచాంగం వినించారు.

భూత్పూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో మంగళవారం తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకొన్నారు. రామలింగేశ్వర ఆలయంలో చైర్మన్ బస్వరాజ్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, అశోక్ గౌడ్ పాల్గొన్నారు. అర్చకులు మంజునాథ్ పంచాంగం విన్పించారు. కప్పెటలో శకటోత్సవంలో వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

దేవరకద్ర పట్టణంలోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఉగాది పండుగను పురస్కరించుకుని పంచాంగ శ్రవణం వినిపించారు. పట్టణానికి చెందిన పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పంచాంగ శ్రవణానికి హాజరుకాగ వేద పండితులు క్రోధి నామ సంవత్సరానికి సంబంధించి పలు అంశాలపై పంచాంగం చెప్పారు.

'అయ్యవారు మా పార్టీ గెలుస్తుందంటావా?'



నవాబుపేట: అయ్యవారు ఎంపీ ఎన్నికలలో మా పార్టీ గెలుస్తుందంటావా... మొన్న బీఆర్‌ఎస్ ఓడి కాంగ్రెస్ గెలిచింది... ఇపుడు జరిగే ఎన్నికలలో బీజేపీ గెలుస్తుందా... లేకా కాంగ్రెస్సా.. అంటూ అన్ని ఆలయాల్లో పంచాంగ శ్రవణంలో తమ పార్టీల గెలుపుపై నాయకులు ఆరాతీశారు. అలాగే తమ గ్రామంలో నాయకుల పరిస్థితి ఎలా ఉండడనుందని.. ఈసారి సర్పంచ్‌కు నిలబడితే గెలుస్తాడా అంటూ అడిగి తెలుసుకోవడం గమనార్హం. నవాబుపేట, చెన్నరెడ్డిపల్లి, ఇప్పటూర్, కారుకొండ, రుద్రారం, చౌడూర్, కొల్లూర్, పోమాల్, యన్మన్‌గండ్ల, గురుకుంట, లింగంపల్లి, లోకిరేవు తదితర గ్రామాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో ఇలాంటి అంశాలు చోటు చేసుకున్నాయి. మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోర ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, పచ్చడి పంపిణీ నిర్వహించారు.



వెన్నాచేడ్‌లో పంచాంగ శ్రవణం



మాచన్‌పల్లిలో..



కప్పెటలో శకటోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు



చొక్కంపేట్‌లో..



టంకరలో పచ్చడి పంపిణీ



దేవరకద్రలో ..



బాలానగర్‌లో..



మిడ్జిల్‌లో..

షబే ఖదర్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్‌లోగల మజీదే అలీ బా అబ్దుల్లాలో సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో షబే ఖదర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని మజీదే ఆమేనాలో గత 30 ఏళ్లుగా ఖతీబే ఇమామ్‌గా ఉపన్యాసాలతోపాటు జాగరణ రాత్రుల్లో ధార్మిక సందేశాలు ఇస్తూ తనవంతు ధార్మిక సేవలు అందిస్తున్న మౌలానా గులాం మహ్మద్‌ను అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జహంగీర్‌బాబా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. అదే విధంగా అలీ బా అబ్దుల్లా మజీద్ ఇమామ్ మౌలానా మహ్మద్ ముబారక్ ఖాస్మి, మౌజన్ అబ్దుల్ ఖాదర్‌లను కూడా మహెరుమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అలీ బా అబ్దుల్ మజీద్ కమిటీ అధ్యక్షులు రహెమాన్ సోఫి, ఆమేనా మజీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జహంగీర్‌బాబా, మహమూద్, మహ్మద్ రఫీ, మిర్జా ఖాజా అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం



చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజా పాలనలో ప్రజలకు హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కురుమూర్తి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నెజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



జడ్చర్ల టౌన్: సత్యసాయి సేవాసమితి జడ్చర్ల ఆధ్వర్యంలో పట్టణంలో రెండు చలివేంద్రాలు ప్రారంభించారు. ఆర్టీసీ అధికారుల విజ్ఞప్తి మేరకు ప్రయాణీకుల సౌకర్యార్థం జడ్చర్ల బస్టాండ్‌లో ఒక చలివేంద్రాన్ని, బాదేపల్లి పట్టణంలోని వాసవీబుక్‌స్టాల్ ఎదురుగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెండింటినీ సత్యసాయి సేవాసమితి సభ్యులు ప్రారంభించారు. కన్వీనర్ రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో జిల్లా హమాలీ సంఘం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ నాగరాజు సహకారంతో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

నిర్ణయం హర్షదాయకం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో సీఏఏ చట్టాన్ని అమలుపరచబోమని రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించడాన్ని ఆల్‌మేవా స్వాగతిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ముస్లింలలో తీవ్ర భయాందోళనలను కలిగిస్తున్న సీఏఏ లాంటి అమానుష చట్టాలను కేంద్రం పూర్తిగా ఉపసంహరించుకునే విధంగా లౌకికవాద శక్తులు ఏకం కావలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



పేరూర్‌లో పోటీలు తిలకిస్తున్న గ్రామస్తులు

దేవరకద్ర: కొత్తకోట మండలం పేరూర్ గ్రామంలో మంగళవారం ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఎద్దుల బండి గిర్క పోటీలు, బండలాగుడు పోటీలు నిర్వహించారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోటీలను ప్రారంభించంగా గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు. బండలాగుడు, ఎద్దుల బండి గిర్క పోటీలను ఎంతో ఉత్సహ భరితంగా జరిగాయి. మొదటి బహుమతి కింద రూ. 5016, రెండో బహుమతి రూ. 2516, మూడో బహుమతిగా రూ. 1600 అందజేశారు. పోటీలో పాల్గొన్న మిగతా వారికి గంట పట్టీలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరు అయిన వారందరికి ఉగాది పచ్చడి అందించారు. కిష్టరెడ్డి, నాగిరెడ్డి, బాలస్వామి, శ్రీనివాస్‌యాదవ్, చంద్రారెడ్డి, రాజు, ఆంజనేయులు, వనంరాములు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



బాలానగర్: ఈదమ్మగడ్డ తండాలో అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న దుకాణంలో మంగళవారం పోలీసులు సోదాలు చేశారు. 15 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. నేనావత్ నందుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాజీ వివరించారు.

అధ్యక్షురాలుగా సాహితీరెడ్డి



జడ్చర్ల: పాలమూరు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా జడ్చర్లకు చెందిన సాహితీరెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉపాధ్యక్షురాలుగా కొనసాగుతున్న ఆమెకు ఆ పార్టీ అధిష్టానం అధ్యక్షురాలుగా పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా సాహితీరెడ్డి మాట్లాడారు. తనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టిన ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి, మహిళా సాధికారతకు కృషి చేస్తానని ఈసందర్భంగా ఆమె తెలిపారు.

ఆలయానికి విరాళాలు



మహమ్మదాబాద్: ఆలయ పునర్‌నిర్మాణంలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. నంచర్లలో హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన యువకుడు జమాల్‌పూర్ యాదోజీ రూ. 51వేల చెక్కును మంగళవారం అందించిన సందర్భంగా మాట్లాడారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న 'ముప్పు'



జానంపల్లిలో కప్పు ఉంచకుండా వదిలేసిన బోరు.



గండేడ్‌లో వ్యవసాయ పొలం వద్ద వదిలేసిన బోరు బావి

- మూయకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారుతున్న
- నీరుపడని బోరు బావులు
- పట్టించుకోని అధికారులు

గండేడ్: మండల పరిధిలో వినియోగంలేని బోరుబావులను నిర్లక్ష్యంగా అలాగే తెరిచి ఉంచి వదిలేయడం ఆందోళన కలిగిస్తోంది. పలుచోట్ల బోరుబావుల్లో పడి చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు పునరావృతం అవుతున్నా.. ఎటువంటి చలనం కనిపించడం లేదు. ప్రమాదం అని తెలిసినా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అటు రైతులుగానీ.. ఇటు అధికార యంత్రాంగం గానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఎప్పుడు ఏ ఆపద ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా 30 వరకు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో వ్యవసాయం బోర్లు , నీటి సరఫరాకు పనికి వచ్చే బోర్లు 4వేలకు పైగా ఉన్నా యి. ఇటీవల భూగర్భజలాలు తగ్గుతుండడంతో కొత్త బోర్ల ఎక్కువ సంఖ్యలో వేస్తున్నారు. ఎండలు ఎక్కువ కావడంతో పాటు అడుగంటిన జలాల కారణంగా కొత్త బోర్ల తవ్వకం అనివార్యం అయింది. అయితే వీటిని తవ్వడం తప్ప నీరు పడకపోతే తిరిగి మూసివేయడం లేదు. వేయడంలో చూపిన శ్రద్ధ మూసివేయడంలో చూయించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరుపడని బోర్లను కప్పడం గానీ, మూసివేయించడం గానీ చేయడం లేదని అంటున్నారు. జానంపల్లి, రెడ్డిపల్లి, గండేడ్, కొండారెడ్డిపల్లి, రుసుంపల్లి, పగిడ్యాల్, బల్సుర్‌గొండ తదితర గ్రామాల్లో ఎక్కడో ఒకచోట ఇలాంటి బోర్లు దర్శనం ఇస్తున్నాయి. వందల ఫీట్లలోతు ఉండే వీటిల్లో చిన్న పిల్లలు పడిపోయే అవకాశం ఉంది.

గతంలో కోస్గి సమీపంలో వ్యవసాయ పొలంలో బోరుబావిలో బాలుడు పడ్డాడు. రెండు మూడు రోజుల పాటు శ్రమించినా ఫలితం లేకపోయింది. నిండు ప్రాణం బలైంది. ఇలా ఎక్కడో ఒకచోట తరుచుగా ఇలాంటి ఘటనల గురించి వింటున్నప్పటికీ బాధ్యత రహితంగా వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

చర్యలు తీసుకుంటాం...



గ్రామాల్లో గానీ.. వ్యవసాయ పొలాల వద్ద గానీ.. బోరుబావులను నిర్లక్ష్యంగా వదిలేయరాదు. కేసింగ్ లేకుండా వాటిని అలాగే వదిలేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాంటివి ఎక్కడ ఉన్నా పూడ్చి వేసేలా చర్యలు తీసుకుంటాం. ఇదివరకే ఆర్ఐలు గ్రామాల్లో ఉన్న వీఆర్‌ఏలకు కూడా ఆదేశాలిచ్చాం. ఎక్కడ అలాంటివి ఉన్నా సంబంధిత యజమానులకు తెలియజేసి వెంటనే వాటిని పూడ్చించేలా చూస్తాం.

– నాగలక్ష్మి, తహసీల్దార్, గండేడ్

అధికారులకు సూచిస్తాం..



గ్రామాల్లో ఎక్కడయిన సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద ప్రమాదకరంగా ఉంటే తక్షణమే సరిచేసేలా చూస్తాం. విద్యుత్ వైర్లు వేళాడడం, తెలడం వంటివి లేకుండా చూసేలా గ్రామ స్పెషల్ ఆఫీసర్లకు , గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచిస్తాం. బోర్లపై కవర్లు లేకపోతే రాళ్లు వంటివి వేసే అవకాశం ఉంది. వాటిపై కవర్లు వేయిస్తాం.

– దేవన్న, ఎంపీడీఓ, గండేడ్

ప్రమాదకరంగా నీటి సరఫరా బోర్లు..



గాధిర్యాల్‌లో ..

అదేవిధంగా గ్రామాల్లో నీటి సరఫరాకుగాను ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ బోర్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. బోర్లపై ఎలాంటి కప్పులు ఉంచకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ వైర్లు సైతం ఇష్టానుసారంగా వేయడం వల్ల ఏముప్పు ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు తెలియక అటువైపు వెళ్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బోర్లను, తవ్వి వదిలేసిన బోర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.